సాక్షి నిజామాబాద్

సోమవారం, 21 ఆగస్టు, 2023



ఇంజినీర్లదే కీలక బాధ్యత

విద్యుత్ సంస్థల్లో డిప్లొమా ఇంజినీర్లదే కీలక బాధ్యతని ఇంజినీర్స్ కంపెనీ జనరల్ సెక్రెటరీ సుబ్రహ్మణ్యేశ్వర్ రావు అన్నారు.

- 8లో ▸



ఎస్సారెస్పీలోకి తగ్గిన వరద

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం 1090 అడుగుల నీరు నిల్వ ఉంది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
25.4 /22.4

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం నుంచి మేఘావృతమై మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలకు రూ.18 కోట్లు మంజూరు




డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో 7 చెక్‌డ్యామ్‌ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.18కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. తన గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూరల్ నియోజవకవర్గంలో గతంలో 11 చెక్‌డ్యామ్‌లు నిర్మించామన్నారు. ప్రస్తుతం 7 చెక్‌డ్యామ్‌లు మంజూరయ్యాయని, త్వరలోనే రెండు సబ్ సర్ఫేస్ చెక్‌డ్యామ్‌లు (రూ.5కోట్లు) మంజూరు కానున్నట్లు తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి చెక్‌డ్యామ్‌ల నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చెక్‌డ్యామ్‌ల నిర్మాణం పూర్తయితే ఆయా వాగుల్లో నీరు నిల్వ ఉండి భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. తద్వారా సమీపంలోని గ్రామాల్లో పంటల సాగుకు రైతులకు ఎండా కాలంలో కూడా ఎలాంటి ఢోకా ఉండబోదన్నారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు నియోజకవర్గ ప్రజల తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబరి మోహన్, సొసైటీ చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సూర్యసురేష్ తదితరులు ఉన్నారు.

బీజేపీ విజయానికి కృషి చేయాలి



ధర్పల్లి: రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అస్సాం రాష్ట్రంలోని నహర్‌కటియా ఎమ్మెల్యే తరంగ గోగోయ్ పేర్కొన్నారు. బీజేపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఎమ్మెల్యే ప్రవాస్ యోజనలో కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన ధర్పల్లిలో పర్యటించారు. మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి సమావేశంలో పాల్గొని, మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు రాష్ట్రంలో ఏ విధంగా అమలు అవుతున్నాయని ఆరా తీశారు. తెలంగాణ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరించాలని, బీజేపీ బలోపేతమే లక్ష్యంగా కృషి చేయాలని బూత్ కమిటీ సభ్యులకు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలకు సూచించారు. అనంతరం బూత్ కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి దినేష్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



ఖలీల్‌వాడి: కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు చేపట్టిన ధర్నా కార్యక్రమం ఆదివారం ఆరో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు సమ్మె కొనసాగిస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం సరైనది కాదన్నారు. ప్రభుత్వం స్పందించి ఏఎన్‌ఎంల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఉద్యోగ సంఘ నాయకులు పుష్ప, కవిత, నాగలక్ష్మి పాల్గొన్నారు.


కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యల ను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ము న్సిపల్ కార్మికుల అధ్యక్షుడు బాబురావ్ అన్నారు. ఆర్మూర్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపడుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె ఆదివా రం 5వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా ఆ యన మాట్లాడుతూ.. ఔట్‌సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రఫీ, భాజన్న పాల్గొన్నారు.

ఆ ఫైల్ కదలికలో మతలబేంది!

- 2014 నియామకాల పదోన్నతులపై అంత ఆసక్తి ఏల..
- తెలంగాణ వర్సిటీ పాలక మండలి తీర్మానాలు సైతం బేఖాతరు
- 43, 45, 48, 53 ఈసీ సమావేశాల్లో తిరస్కరించినప్పటికీ 62వ సమావేశంలో ప్రతిపాదనలు
- ఈసీ మళ్లీ తిరస్కరించినా ఆగని రిజిస్ట్రార్ యాదగిరి ప్రయత్నం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : తెలంగాణ విశ్వవిద్యాలయంలో 2014 లో నియామకమైన అధ్యాపక బృందానికి సంబంధించి కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం కింద పదోన్నతుల అంశాన్ని పాలకమండలి అనేకసార్లు తిరస్కరించినప్పటికీ తాజాగా సదరు ఫైల్‌ను మూవ్ చేస్తుండడం విస్మయానికి గురిచేస్తోంది. కోర్టులో ఉండడంతో పదోన్నతుల విషయమై ముందుకు వెళ్లాల్సిన అవసరం కూడా లేదని పాలకమండలి తేల్చింది. అయినప్పటికీ ప్రస్తుత రిజిస్ట్రార్ యాదగిరి దీన్ని మెల్లగా కదుపుతున్నారు. 2014లో అప్పటి వీసీ అక్బర్ అలీఖాన్ అధ్యాపకులను నియమించారు. ఈ నియామకాలు చెల్లవని 41వ ఈసీ సమావేశంలో తీర్మానం చేయడంతో పాటు క్రిమినల్ కేసు పెట్టాలని నిర్ణయించారు. పైగా ఈ నియామకాలకు వ్యతిరేకంగా కాంట్రాక్ట్ అధ్యాపకులు కోర్టుకు వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రసాదరావు, భాస్కర్ రావు అనే ఇద్దరు ప్రొఫెసర్లతో ద్విసభ్య కమిటీ వేసింది. మరోవైపు అప్పటి గవర్నర్ నరసింహన్ సైతం సీవీ రాములు కమిటీ వేశారు. ఈ రెండు కమిటీలు నియామకాలు అక్రమమని నివేదికలు ఇచ్చాయి. ఈ క్రమంలో వ్యవహారం కోర్టులో ఉన్నందున 43, 45, 48, 53 ఈసీ సమావేశాల్లో 2014 నియామకాల ప్రమోషన్లను తిరస్కరించారు. రవీందర్‌గుప్తా వీసీగా ఉన్న సమయంలో రూ.2 కోట్లతో డీల్ కుదుర్చుకుని ఫైల్ కదిపినట్లు తెలియడంతో గందరగోళం నెలకొంది. ఇతర అవకతవకలు, అక్రమ నియామకాల నేపథ్యంలో వర్సిటీ పరువు బజారుపాలైంది. ఈ నేపథ్యంలో వీసీ రవీందర్‌గుప్తా ఏసీబీకి చిక్కారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌చార్జి వీసీగా ఐఏఎస్ అధికారిణి వాకాటి కరుణను నియమించింది.

వ్యవహారం కోర్టులో ఉన్నప్పటికీ.. ఈసీ అనేక సార్లు తిరస్కరించినప్పటికీ 2014 లో నియామకమైన అధ్యాపక బృందం పదోన్నతుల అంశంపై తెయూ రిజిస్ట్రార్ యాదగిరి ప్రత్యేక శ్రద్ధ చూపడం వర్సిటీ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఆ ఫైల్‌ను ఆయన మెల్లగా కదుపుతున్నారు. తాజాగా ఈ నెల 10న జరిగిన 62వ పాలకమండలి సమావేశం ఎజెండాలో పెట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అన్నీ తెలిసీ ఎజెండాలో ప్రతిపాదన

యూనివర్సిటీని ప్రక్షాళన చేసే దాంట్లో భాగంగా పాలకమండలి గట్టి యుద్ధమే చేసింది. గత వీసీ, రిజిస్ట్రార్ల అక్రమాలపై విజిలెన్స్ విచారణకు సైతం తీర్మానించారు. విజిలెన్స్ విచారణ సైతం నడుస్తోంది. పాలకమండలి సభ్యులు యాదగిరిని ఏరికోరి రిజిస్ట్రార్‌గా నియమించారు. తాజాగా ఈ నెల 10న హైదరాబాద్‌లో 62వ పాలకమండలి సమావేశం జరిగింది. 2014 నియామకాలు, వివాదాల గురించి క్షుణ్ణంగా తెలిసిన యాదగిరి మళ్లీ వాటికి సంబంధించిన ప్రమోషన్ల విషయమై ఎజెండాలో పెట్టారు. ఈసీ సభ్యులు తిరస్కరించినప్పటికీ ప్రమోషన్ల అంశంపై లీగల్ ఒపీనియన్‌కు పంపాలని ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ నిర్ణయించారు. ప్రస్తుత ఇన్‌చార్జి వీసీ అయిన వాకాటి కరుణ గతంలో ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హోదాలో పాలకమండలి సమావేశాలకు హాజరయ్యారు. సమావేశాల్లో వాకాటి కరుణ సైతం ఈ ప్రమోషన్ల వ్యవహారాన్ని అప్పటి ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్‌తో కలిసి తిరస్కరించారు. 53వ ఈసీ సమావేశంలో సైతం తిరస్కరించిన సమయంలో రిజిస్ట్రార్‌గా యాదగిరి ఉన్నారు. అయినప్పటికీ యాదగిరి కొందరు 2014 బ్యాచ్ అధ్యాపకులతో ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణకు వినతిపత్రం ఇప్పించినట్లు తెలిసింది. తాజాగా ప్రమోషన్ల ఫైల్ మూవ్ చేస్తుండడంతో అనుమానాలు వ్యక్తవుతున్నాయి.

ఎవరికో కిక్కు లక్కు!



- మద్యం దుకాణాలకు నేడు లక్కీ డ్రా
- 102 వైన్స్‌లకు 3,759 దరఖాస్తులు
- ఎలక్షన్స్ ఇయర్ కావడంతో పెరిగిన డిమాండ్

ఖలీల్‌వాడి : జిల్లాలోని వైన్స్‌ల కేటాయింపునకు సోమవారం లక్కీ డ్రా తీయనున్నారు. 2023–25 సంవత్సరానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ తీసుకువచ్చింది. ఈ నెల 4 నుంచి 18 వరకు దరఖాస్తులు స్వీకరించగా 102 వైన్స్‌లకు 3759 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సమక్షంలో మద్యం దుకాణాలకు లక్కీడ్రా ప్రక్రియ సాగుతుంది.

ఉదయం 10.30 గంటలకు డ్రా తీయడం ప్రారంభమవుతుందని, దరఖాస్తుదారులు ఉదయం 10 గంటల వరకు హాజరు కావాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు. లక్కీ డ్రాలో గెలుపొందిన వారికి వైన్స్‌లను కేటాయిస్తారు. లక్కీ డ్రాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎక్సైజ్ సూపరింటెండెంట్‌తో రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ ముష్రారఫ్ అలీ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వైన్స్‌లను దక్కించుకున్నవారు లైసెన్స్ ఫీజులో ఆరో వంతు అదే రోజు లేదా మరుసటి రోజుగా చెల్లించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో దుకాణ కేటాయింపు రద్దు చేస్తారు. డిసెంబర్ 1 నుంచి వైన్స్‌లకు కొత్త పాలసీ మద్యం సరఫరా అవుతుంది.

గతేడాది కంటే..

త్వరలోనే శాసన సభ ఎన్నికలు రానున్న నేపథ్యంలో మద్యంకు డిమాండ్ ఉంటుంది. ఈ నేపథ్యంలో దరఖాస్తులు ఎక్కువ వచ్చినట్లు తెలుస్తోంది. పార్లమెంట్ , సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు కూడా ఉండటంతో వైన్స్‌లకు నష్టాలు రావని, ఆదాయం వస్తుందని ఎక్కువ సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. గతంలో తక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చిన వైన్స్‌లకు సైతం ఈసారి పది వరకు దరఖాస్తులు రావడం గమనార్హం. అంతేగాకుండా వైన్స్‌లకు గత ఏడాది ఏడుసార్లు మార్జిన్ ఇవ్వాగా ఈ సారి 10 సార్లు మార్జిన్ ఇవ్వడంతో దరఖాస్తుదారులు ఆసక్తి చూపించారు.

అదేవిధంగా 2021–23 మద్యం పాలసీకి 1762 దరఖాస్తులు రాగా ప్రభుత్వానికి రూ.35.24 కోట్లు ఆదాయం చేకూరింది. ఈసారి రూ.75.18 కోట్ల ఆదాయం వచ్చింది.

ఎక్సైజ్ స్టేషన్ పరిధి	వైన్స్‌లు	దరఖాస్తులు
మోర్తాడ్	19	459
ఆర్మూర్	26	834
నిజామాబాద్	35	1,518
బోధన్	18	518
భీమ్‌గల్	12	430

డీకే అరుణ, బీజేపీ నేతల అరెస్టు



అరెస్ట్ అయిన బీజేపీ శ్రేణులతో మల్లికార్జున్‌రెడ్డి



టోల్‌ప్లాజా వద్ద డీకే అరుణ, అర్వింద్

బాల్కొండ / ఇందల్వాయి : నిర్మల్ జిల్లా కేంద్రంలో పట్టణ నూతన మాస్టర్ ప్లాన్‌ని రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు మహేశ్వర్ రెడ్డి చేపట్టిన నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపేందు కు వెళ్తున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అ రుణను నిర్మల్ జిల్లా సోన్ వద్ద నిజామాబాద్ జిల్లా మెండోరా, నిర్మల్ పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. ఆమెను హైదరాబాద్‌కు తరలించారు. అంతకు ముందు ఆమెకు స్వాగతం తెలిపేందుకు వచ్చిన ని ర్మల్‌కు చెందిన బీజేపీ నాయకులను మెండోరా మండలం చాకీర్యాల్ వద్ద మెండోరా పోలీసులు అ రెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఐదు గంట ల పాటు నిర్బంధించారు. ఎంపీ అర్వింద్‌కు ఫోన్ లో బీజేపీ నాయకులు సమాచారం అందించడంతో ఆయన వెంటనే బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏలేటి మల్లికార్జున్ రెడ్డికి తెలిపారు. మల్లికార్జున్ రెడ్డి ఠాణా కు వెళ్లి విడుదల చేయించారు. అలాగే డీకే అరుణ ను ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద సైతం డిచ్‌పల్లి సీ ఐ కృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. అదే సమయంలో జగిత్యాల వైపు వెళుతున్న ఎంపీ అ ర్వింద్ టోల్‌ప్లాజా వద్ద ఆగి పోలీసులతో వాగ్వాదం పెట్టుకున్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు కనీసం మద్దతు తెలిపేందుకు వెళ్ల కూడదా అని ఎంపీ పోలీ సులను ప్రశ్నించారు. పోలీసులు ప్రభుత్వానికి గు లాంగిరి చేస్తున్నారని అన్నారు. తాను ఒంటరిగా వెళుతున్నాని తనవెంట వాహనాల కాన్వాయ్ గాని, కార్యకర్తల బలగం గానీ లేదని డీకే అరుణ తెలిపా రు. ఇరువురి నేతల నిరీక్షణ అనంతరం ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు డీకే అరుణను టోల్‌ప్లాజా దాటేందుకు పోలీసులు అనమతించారు. ఇందల్వాయి ఎస్సై మహేశ్ బందోబస్తుతో డీకే అరుణను నిర్మల్ వైపు పయనమయ్యారు.

రూపాయి తిరకాసు



మోర్తాడ్(బాల్కొండ) : ఊరించి ఉసూరుమనిపించినట్టుంది రుణమాఫీపై తెలంగాణ ప్రభుత్వం తీరు.. రూ.99,999 వరకు బకాయి ఉన్న పంట రుణాలకే మాఫీని వర్తింప చేసిన విషయం విదితమే. రూ.లక్ష, అంతకు మించి పంట రుణాలు పొందిన రైతులకు కనీసం రూ.లక్ష వరకైనా మాఫీ సొమ్ము జమ చేస్తారని ఆశించిన వారికి భంగపాటు తప్పడం లేదు. జిల్లాలో అనేక మంది రైతులు ఆహార ధాన్యాలకంటే వాణిజ్య పంటలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఆహార పంటల కంటే వాణిజ్య పంటలకు రెట్టింపు పెట్టుబడి అవసరం అవుతుంది. అందువల్ల రైతులు బ్యాంకుల్లో రుణం రూ.లక్షకు మించి పంట రుణం తీసుకున్నారు. రెండు ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతులు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షలు, రూ.3 లక్షల వరకు పంట రుణాలు పొందారు.

■ ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఒకరికి ఎంత రుణం ఉన్నా, ఒక కుటుంబంలో ఇద్దరు, ముగ్గురికి రుణం ఉన్నా కుటుంబం యూనిట్‌గా రూ.లక్ష పంట రుణం మాఫీ వర్తిస్తుంది. రూపాయి తిరకాసుతో రూ.లక్ష అంతకు మించి ఎక్కువ రుణం ఉన్నవారికి మాఫీ సొమ్ము ఇప్పట్లో జమ అయ్యే అవకాశం కనిపించడం లేదు. ఇప్పుడు రూ.లక్ష లోపు రుణం బకాయి ఉన్నవారికే మాఫీ సొమ్ము జమ చేస్తున్నారు. దీనికి సంబంధించి వ్యవసాయ శాఖ వద్ద సరైన సమాచారం లేకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది.

■ జిల్లాలో రుణం మాఫీ వర్తించాల్సిన రైతుల సంఖ్య 2,91,188 మందిగా గుర్తించారు. ఇప్పటి వరకు 56,303 మంది రైతులకే రుణం మాఫీ సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. 2018లో రుణమాఫీపై సీఎం కే చంద్రశేఖర్‌రావు హామీ ఇచ్చిన తర్వాత వ్యవసాయ శాఖ జిల్లా రుణమాఫీ లక్ష్యం రూ.1,790 కోట్లుగా నిర్ధారించింది.

అయితే ఇప్పటి వరకు జిల్లా రైతులకు రూ.243.49 కోట్లు మాఫీ సొమ్ము జమ చేశారు. అంటే ఇంకా రూ.1,546.51 కోట్లు మాఫీ కావాల్సి ఉంది. రూ.లక్ష వరకు రుణమాఫీ ప్రకటన వచ్చి అమలు చేస్తేనే లక్ష్యానికి అనుగుణంగా రైతులకు రుణం మాఫీ వర్తిస్తుంది.

మాఫీ కాని రూ.లక్ష రుణం

- రూ.99,999 వరకే వర్తిస్తున్న రుణాలకు మాఫీ
- రూ.లక్షకు మించి రుణం ఉన్నవారికి ఎదురవుతున్న నిరాశ

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



రుణమాఫీపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. రూపాయి తక్కువ రూ.లక్ష అంటే అసలు రుణమాఫీ రూ.లక్ష వరకు ఇస్తేనే జరుగుతుంది. అనేక మంది రైతులు రూ.లక్షకు మించి పంట రుణాలను బ్యాంకుల నుంచి పొందారు. ఈ విషయం ప్రభుత్వానికి తెలిసినా పట్టించుకోలేదు.

– బద్దం రాజశేఖర్, రైతు, తిమ్మాపూర్

మాట తప్పిన ప్రభుత్వం



రుణమాఫీపై ప్రభుత్వం మాట తప్పింది. రూ.99,999 వరకు రుణ మాఫీ అంటే రైతులు రూ.లక్ష కంటే రూపాయి తక్కువ అనుకున్నారు. కానీ లేనిపోని తిరకాసుతో ప్రభుత్వం రైతులను మభ్యపెట్టిందని ఆలస్యంగా తెలిసింది. రైతులతో ఆటలాడుకోవడం సరికాదు.

– గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, రైతు, దొన్కల్

మాటలే చెబుతున్నారు.. చేతల్లో లేదు



రైతు రుణమాఫీ విషయంలో ప్రభుత్వం మాటలే చెబుతుంది. రూ.లక్ష వరకు రుణమాఫీ అని చెప్పి ఇప్పుడు రూపాయి తక్కువ అంటే ఏమన్నట్లు. అసలు ప్రభుత్వానికి రైతులపై శ్రద్ధ ఉంటే ఇలా వ్యవహరించదు. లక్షణంగా రుణమాఫీ అని ఇప్పుడు చేతులెత్తివేయడం ఎంత వరకు సమంజసం. – మాదాం ప్రణీత్, రైతు, తొర్తి

రైతుబీమా... కుటుంబాలకు ధీమా

- కొత్తగా 13,174 మంది నమోదు
- బీమా పథకంలో 1,62,245కు చేరిన రైతుల సంఖ్య
- ఐదేళ్లలో 4,913 కుటుంబాలకు చేయూత



డొంకేశ్వర్ (ఆర్మూర్) : రైతుబీమా పథకం రైతు కుటుంబాలకు అండగా నిలుస్తోంది. రైతు ఒక్క రూపాయి కూడా కట్టకుండా రాష్ట్ర ప్రభుత్వమే ప్రీమియం మొత్తాన్ని భరించి ఎల్‌ఐసీకి చెల్లిస్తోంది. పట్టా ఉండి పంటలు సాగు చేస్తున్న రైతు అకాల మరణం చెందితే ఆ రైతు కుటుంబానికి రూ.5 లక్షలు బీమా రూపంలో అందుతున్నాయి. 2018లో రైతుబీమా పథకం ప్రారంభం కాగా, దరఖాస్తు చేసుకున్న వారిలో ఇప్పటి వరకు జిల్లాలో 4,913 మంది రైతులు మరణించారు. వారికి కుటుంబాలకు మొత్తం రూ.245.65 కోట్లు ఎల్ఐసీ చెల్లించింది. దీంతో ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన రైతు కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికంగా భరోసానిస్తోంది. అయితే, కొత్తగా పట్టాపాసు పుస్తకాలు పొందిన రైతుల నుంచి జూలై 10 నుంచి ఆగస్టు 5 వరకు వ్యవసాయాధికారులు దరఖాస్తులు స్వీకరించారు. పట్టాపాసు పుస్తకం జిరాక్స్‌తో పాటు ఆధార్, నామిని ఆధార్ కార్డును రైతులు అందజేశారు. మొత్తం 13,174 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో రైతుబీమా పథకంలో ప్రస్తుతం రైతుల సంఖ్య 1,62,245కు చేరింది.

ఏడాది వారీగా బీమా వివరాలు..

సంవత్సరం	లబ్ధి పొందిన కుటుంబాలు	అందించిన బీమా (రూ.కోట్లలో..)
2018-19	703	35.15
2019-20	866	43.30
2020-21	1340	67.00
2021-22	1046	52.30
2022-23	958	47.90
మొత్తం:	4,913	245.65

పక్షం రోజుల్లోనే బీమా డబ్బులు

రైతు బీమాకు దరఖాస్తు చేసుకున్న రైతు మరణిస్తే రైతు కుటుంబంలో నామినిగా ఉన్న వారికి బీమా డబ్బులు అందుతున్నాయి. రైతు మరణించినట్లు ధ్రువీకరించిన డెత్ సర్టిఫికెట్‌తో పాటు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, నామిని ఆధార్, బ్యాంకు ఖాతాను వ్యవసాయాధికారులకు అందజేస్తే సరిపోతుంది. పక్షం రోజుల్లో బీమా క్లెయిమ్ అవుతుంది. వెంటనే రైతు కుటుంబంలో నామినిగా ఉన్న వారి బ్యాకు ఖాతాలో డబ్బులు జమవుతాయి. బీమా క్లెయిమ్ సమయంలో ఎమైనా ఇబ్బందులు ఎదురైతే వ్యవసాయాధికారులు రాష్ట్ర శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తున్నారు.

ఆలస్యం కాకుండా చూస్తున్నాం..

బీమా ఉన్న రైతు మరణిస్తే బాధిత కుటుంబానికి ఆలస్యం కాకుండా త్వరగా బీమా డబ్బులు అందేలా చూస్తున్నాం. బీమా డబ్బులు చాలా కుటుంబాలకు ఆర్థికంగా ఉపయోగపడుతున్నాయి. ఇటీవల కొత్తగా వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేశాం.

– వాజిద్ హుస్సేన్, జిల్లా వ్యవసాయాధికారి

కిలిమంజారోపై నాళేశ్వర్‌వాసి

కేసీఆర్ ఫ్లెక్సీ ఆవిష్కరించిన యువకుడు



మారుతిని సన్మానిస్తున్న గ్రామస్తులు



సీఎం కేసీఆర్ చిత్రపటంతో మారుతి

నవీపేట మండలం నాళేశ్వర్ గ్రామానికి చెందిన ఆర్మూర్ మారుతి అనే యువకుడు సౌత్ ఆఫ్రికాలోని ఎత్తైన కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించాడు. ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన పర్వతంపైకి చేరుకుని త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాగించాడు. అలాగే సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే షకీల్ చిత్రపటాలను ప్రదర్శించాడు. మైనస్ 7 డిగ్రీల ఉష్ణోగ్రత కలిగిన పర్వతంపై సాహోపేతనమైన యాత్ర చేశాడు. ఆదివారం ఆర్మూర్ మారుతి స్వగ్రామానికి చేరుకోవడంతో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ద్యాగ సరిన్, బినోల సొసైటీ చైర్మన్లతో పాటు వీడీసీ ప్రతినిధులు మారుతిని ఘనంగా సన్మానించి, ఊరేగింపు నిర్వహించారు.

– నవీపేట

క్లుప్తంగా

వలస కార్మికుల స్థితిగతులపై సర్వే



మోర్తాడ్ (బాల్కొండ): ఉపాధి కోసం గల్ఫ్‌తో పాటు ఇతర దేశాలకు వలస వెళ్లి సొంత గడ్డకు చేరుకున్న వలస కార్మికుల జీవన ప్రమాణాలు, వారి స్థితి గతులపై అంచనా వేయడానికి సర్వే నిర్వహిస్తున్నారు. ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్(ఐఓఎం), సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్(ఎస్ఈఎస్ఎస్)ల ఆధ్వర్యంలో కొన్ని రోజుల నుంచి గల్ఫ్ ప్రభావిత జిల్లాల్లో ఈ సర్వే సాగుతుంది. తాజాగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్ ప్రతినిధి భరత్ భూషన్ ఈ సర్వేను నిర్వహించారు. 18 అంశాలపై సమాచారం సేకరిస్తున్నారు.

■ విదేశాలకు వలస ఎందుకు వెళ్లాల్సి వచ్చింది, ఎన్ని సంవత్సరాలు అక్కడ పని చేశారు. విదేశాల్లో ఏ విధమైన పని చేశారు, ఎందుకు సొంతూరికి రావాల్సి వచ్చింది, వలస వల్ల కుటుంబ ఆర్థికాభివృద్ధి ఏమైనా జరిగిందా, జీత భత్యాలు ఒప్పందం ప్రకారం చెల్లించారా ఇలా వివిధ అంశాలపై ఎస్ఈఎస్ఎస్ సంస్థ ప్రతినిధి ఇంటికి వచ్చిన వలస కార్మికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

■ వలస కార్మికులకు పునరావాసం, పునరేకీకరణ అంశంపై ప్రభుత్వం స్పందించాలని ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని వలస కార్మికుల సంఘాలు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నాయి. వలస కార్మికుల అంశమే ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కార్మికులకు దిక్కుమొక్కు లేకుండా పోయింది. ఈ తరుణంలో ఐఓఎం, ఎస్ఈఎస్ఎస్ సంస్థలు వాపసు వచ్చిన వలస కార్మికుల జీవన ప్రమాణాలపై సర్వే నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఏడాది చివరికల్లా అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున ప్రభుత్వం ఏదైనా మంచి నిర్ణయం తీసుకుంటుదా అని వలస కార్మికులు ఎదురుచూస్తున్నాయి.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



బాల్కొండ: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని బాల్కొండ ఏఎస్సై శంకర్ అన్నారు. బాల్కొండ మండలం చిట్టాపూర్, కిసాన్‌నగర్ కూడలిల వద్ద ఆదివారం యువకులకు కమ్యూనిటీ పోలిసింగ్‌లో భాగంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. పోలీసులకు యువత సహకరించాలని కోరారు. పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగట్లో ఆడపిల్ల

రామారెడ్డి మండలం అన్నారం పీహెచ్‌సీ పరిధిలోని ఓ తండాలో ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లి ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన వెంటనే నిజామాబాద్‌లో నివసించే దంపతులకు అమ్మేసింది. దీనిని పసిగట్టిన అంగన్‌వాడీ సిబ్బంది ఐసీపీఎస్, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారం తర్వాత ఆ పసిపాపను నిజామాబాద్‌లో గుర్తించారు. రామారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో తల్లికి బిడ్డను అప్పగిస్తే ఆమె బిడ్డను తీసుకునేందుకు నిరాకరించింది. చివరికి చిన్నారిని నిజామాబాద్‌లోని శిశుగృహకు తరలించారు.

- నిరుపేద కుటుంబాలే లక్ష్యంగా దందా
- అస్పత్రుల్లోనే కొనసాగుతున్న బేరసారాలు
- అధికారుల తనిఖీలతో వెలుగులోకి వస్తున్న ఘటనలు
- అవగాహన కల్పించినా మారని తల్లిదండ్రులు



స్వాధీనం చేసుకున్న బిడ్డతో ఐసీపీఎస్ సిబ్బంది, పోలీసులు (ఫైల్)

రామారెడ్డి: జిల్లాలో శిశువుల క్రయవిక్రయాలు గుట్టుచప్పుడు కాకుండా జోరుగా సాగుతున్నాయి. కొందరు దళారుల పాత్ర పోషించి శిశువుల అమ్మకాల దందాను ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. నిరుపేద కుటుంబాలే లక్ష్యంగా చేసుకుని ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో సవతి తల్లి సంతలో పశువులను విక్రయించినట్లు తన చిన్న కుమార్తెను రూ. 80 వేలకు, పెద్ద కుమార్తెను రూ. 50 వేలకు విక్రయించి వదిలించుకునేందుకు ప్రయత్నం చేసింది. దీంతో ఆ మైనర్ బాలికలు పోలీసులను ఆశ్రయించడంతో సవతి తల్లి, తండ్రితో పాటు మరో ఐదుగురిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. జిల్లాలో మారుమూల పల్లెలు, తండాల్లో నిరుపేదలే లక్ష్యంగా దళారులు రంగప్రవేశం చేసి డబ్బు ఆశ చూపి అభం శుభం తెలియని ఆ చిన్నారులను చట్టవిరుద్ధంగా అమ్ముతున్నారు.

అంగన్‌వాడీ టీచర్ల నిఘా ఉన్నా..

ఏ గ్రామంలోనైనా ఓ మహిళ గర్భం దాలిస్తే ఆ ప్రాంతంలోని అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలకు సమాచారం తీసుకుని వారికి ఆరోగ్య పరీక్షలు చేయిస్తుంటారు. గర్భవతి వివరాలు అంగన్‌వాడీల్లో నమోదు చేసి గర్భిణికి, అనంతరం బాలింతకు పోషకాహారం అందిస్తారు. కాని కొందరు ముందే దళారులతో ఒప్పందం చేసుకుని గర్భం దాల్చిన ప్పటికీ వివరాలు నమోదు చేయించకుండా వేరే ఊళ్లో ఉంటూ పుట్టిన బిడ్డను అమ్ముకుంటున్నారు. ఎక్కువగా జిల్లాలో మారుమూల గ్రామాలు, పల్లె, తండాల్లో శిశువుల అమ్మకాలు కొనసాగుతున్నాయి. చట్ట విరుద్ధంగా పిల్లలను అమ్మడం నేరం అని తెలిసినా చట్టం, అధికారుల కళ్లు గప్పి బిడ్డను రూ.లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు తీసుకుని అమ్ముకుంటున్నారు. వచ్చిన డబ్బులో 50 శాతం మధ్యవర్తిగా వ్యవహరించిన వ్యక్తే తీసుకుంటున్నప్పటికీ వచ్చిన డబ్బులు తీసుకుని బిడ్డను అప్పగించేస్తున్నారు. ఎక్కడైనా డబ్బు పంపిణీలో వివాదం ఏర్పడినప్పుడే ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తున్నాయి. మరోవైపు అంగన్‌వాడీ, ఆశవర్కర్ల సిబ్బంది వల్ల కూడా పుట్టిన బిడ్డ కనిపించకపోవడంతో ఐసీడీఎస్ సిబ్బందికి ఫిర్యాదు చేస్తున్నారు.

చట్ట వ్యతిరేకమని తెలిసినా..

పిల్లలు లేని వారు చిన్నారులను అమ్మడం, కొనుగోలు చేయడం చట్టవిరుద్ధం అని తెలిసినా గోప్యంగా కొనుగోలు చేయడానికే ఆసక్తి చూపుతున్నారు. చట్ట ప్రకారం 'కారా' ద్వారా దరఖాస్తులు చేసుకోవడం, శిశుగృహ నుంచి పిల్లలను చట్ట ప్రకారం దత్తత తీసుకోవడం ఆలస్యం అవుతుండడంతో పిల్లల కోసం కొందరు తప్పుడు మార్గాలను ఎంచుకుంటున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



శిశువుల అమ్మకాలు చేస్తే అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు వెంటనే గుర్తించే వ్యవస్థ ఉంది. అలా గుర్తించి ఇటీవలే అప్పుడే పుట్టిన ఆడపిల్లలను పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది ద్వారా రికవరీ చేసి, తల్లికి అప్పగించాం. ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. – ఉమాదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, రామారెడ్డి

డిప్లొమా ఇంజినీర్లదే కీలక బాధ్యత



మాట్లాడుతున్న డిప్లొమా ఇంజనీర్స్ కంపెనీ జనరల్ సెక్రెటరీ సుబ్రహ్మణ్యేశ్వరరావు

నిజామాబాద్‌నాగారం: విద్యుత్ సంస్థలో డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ కీలక బాధ్యతలు నిర్వహిస్తోందని డిప్లొమా ఇంజనీర్స్ కంపెనీ జనరల్ సెక్రెటరీ సుబ్రహ్మణ్యేశ్వర రావు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ జిల్లా అసోసియేషన్ 2023–25కు గాను ఎన్నికలకు సంబంధించి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. సంస్థ అభివృద్ధి కోసం కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. వినియోగదారుడే మనకు సర్వస్వమన్నారు. అనంతరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్, ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ తోట రాజశేఖర్, కంపెనీ అడ్వయిజర్లు ప్రకాశ్, సంయుక్త కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, మహిళా ప్రతినిధి సుమితా, డిప్లొమా ఇంజనీర్స్, సభ్యులు పాల్గొన్నారు.

నూతన జిల్లా కమిటీ ఇలా..

అధ్యక్షుడిగా రాజేందర్‌రెడ్డి, కార్యదర్శి కాశీనాథ్, కోశాధికారి శ్రీనివాస్, మహిళా ప్రతినిధి సుమిత, ఆఫీస్ సెక్రెటరీ శ్రీరామమూర్తి, డివిజన్ కార్యదర్శులు, కోశాధికారి బల్ల శ్రీనివాస్, భరత్, బోధన్ నాయిని కృష్ణ, ఫక్రుద్దీన్, ఆర్మూర్ రాజేశ్వర్, గంగాధర్, ఎంఆర్టీ డివిజన్ బాలచందర్, కిషోర్, డిచ్‌పల్లి శంకర్‌గౌడ్, దివ్యను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా వై ప్రకాశ్, శ్రీధర్‌రెడ్డి వ్యవహరించారు.

మాజీ సైనికులు అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న గంగామోహన్

నిజామాబాద్ నాగారం: ఉమ్మడి జిల్లాల్లో ఉన్న మాజీ సైనికులు, వితంతువులు, వారిమీద ఆధారపడిన కుటుంబ సభ్యులు అందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని వృద్ధిలోకి రావాలని సైనిక సంక్షేమ కార్యాలయ ఉద్యోగి గంగామోహన్ తెలిపారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని సైనిక కార్యాలయంలో ప్రత్యేకంగా మాజీ సైనిక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే రాయితీలు, సదుపాయాల గురించి వివరించారు. సర్వీసులో ఉండి ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.3 లక్షలు, సర్వీసు అనంతరం 58 ఏళ్ల వయస్సులో చనిపోతే రూ. 2లక్షల ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. పథకాలకు సంబంధించి బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది షేక్ ఫహియొద్దీన్, లక్ష్మణ్, ఉమేర్, మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు గుజరాతీ మోహన్, కార్యదర్శి దివాకర్, కామారెడ్డి అధ్యక్షుడు పాపిరెడ్డి, కార్యదర్శి సంజీవ్, సాయారెడ్డి, పీరయ్య, రవికాంత్, లలిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి తగ్గిన వరద నీరు



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వద నీరు ఆదివారం తగ్గుముఖం పట్టింది. క్రితం రోజు 50,925 క్యూసెక్కులు వచ్చిన వరదనీరు ఆదివారం ఉదయం 51వేలకు పెరిగింది. తర్వాత 30వేలకు పడిపోయిన వరద సాయంత్రానికి 25,480 క్యూసెక్కులకు పడిపోయింది. దీంతో ప్రాజెక్ట్ నీటిమట్టం వేగంగా పెరగలేదు. ప్రాజెక్ట్‌నుంచి వరద కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కుల నీటిని చేపట్టారు. ఎస్కేప్ గేట్ల ద్వారా 5వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 3వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 152 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 628 క్యూసెక్కుల నీరుపోతోంది. పూర్తిస్థాయి నీటిమట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1090.70(88.6 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టానికి 0.3 అడుగులు దూరంలో 1.4 టీఎంసీల దూరంలో ఉంది. క్రితంరోజు 87 టీఎంసీలు దాటింది. ఎగువ నుంచి 50 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్ట్ శనివారమే నిండకుండలా మారింది. దీంతో వరద గేట్ల ద్వారా మళ్లీ గోదావరిలోకి నీటి విడుదల చేపట్టే అవకాశం ఉందని అధికారులు ప్రకటించారు. కాని ఆదివారం ఉదయం నుంచి ప్రాజెక్ట్‌లోకి వరద నీరు తగ్గుముఖం పట్టడం, వరద కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టడంతో ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం చేరుకోవడానికి మరొక రోజు పట్టేలా కనిపిస్తుంది.

పచ్చిబుట్ట విక్రయానికే మొగ్గు..!

- అడవిపందుల బాధతో ముందుగానే పంటను కోస్తున్న రైతులు
- చివరి వరకు ఉంచితే నష్టపోతామనే ఉద్దేశంతో..
- ధర లభించకున్నా విక్రయిస్తున్న వైనం



బాల్కొండ: ఆరుగాలం శ్రమించిన మక్క పంటపై అడవి పందుల దాడి అధికం కావడంతో రైతులు పచ్చిబుట్ట విక్రయానికే మొగ్గు చూపుతున్నారు. పచ్చిబుట్టను కిలోల చొప్పున వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. 120రోజుల వరకు ఉంచిన తర్వాత వచ్చే పంట కోసం వేచిచూసే పరిస్థితి లేకపోవడంతో రైతులు ఇలా చేస్తున్నారు. ప్రస్తుత ఏడాది జూలైలో పక్షం రోజులు నిరంతరం వర్షాలు కురియడంతో మక్కపంటపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో మక్క పంటకు తెగుళ్లు అధికంగా సోకాయి. తెగుళ్లు సోకడంతో పంట దిగుబడి తగ్గిపోయింది. గతంలో వ్యాపారులు గుత్తాగా కొనుగోలు చేసేవారు. కాని దిగుబడి తగ్గడం వల్ల కిలోలకు రూ. 8 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. దీంతో కొంత మేర రైతులకు నష్టం వాటిల్లుతుంది. మక్క కంకులు విత్తు పోసుకునే దశలోనే అడవి పందులు మక్క పంటపై దాడి చేస్తున్నాయి. దీంతో పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. చివరి వరకు పంటను అలానే ఉంచితే మరింత నష్టం చేకుర్చుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్కువ ధర దక్కిన పచ్చిబుట్టనే విక్రయిస్తున్నారు. మక్కపంట 120 రోజుల్లో పూర్తిగా చేతికందుతుంది. కాని పచ్చిబుట్ట కోసం 60 నుంచి 70 రోజుల్లో చేతికందుతుంది. మక్కలు ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. క్వింటాలుకు రూ. 2వేల ధర పలుకుతుంది. ఇలా ఎకరానికి రూ. 60 వేల వస్తాయి. ప్రస్తుతం పచ్చి బుట్ట అమ్మడం వల్ల ఎకరానికి రూ. 40వేల వస్తున్నాయని రైతులు అంటున్నారు. దీంతో ఎకరానికి రూ. 20 వేల నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలిసొస్తున్న కాలం..

పచ్చి బుట్ట విక్రయం వలన రైతులకు కొంత కాలం కలిసి వస్తుందని రైతులు అంటున్నారు. 120 రోజులకు బదులుగా 60 రోజుల్లోనే పంటను విక్రయించడంతో మరో 60 రోజులు కలిసి వస్తుంది. ఈ కాలంలో అధికంగా అదే నేలలో వేరు శనగ పంటను విత్తుకోవచ్చు అంటున్నారు. వేరు శనగ పంట 90 రోజుల్లో చేతి కందుతుంది. కలిసొచ్చిన రోజులను కలుపుకుని మరో నెల అదనంతో రెండు పంటలను పండించే అవకాశం ఉంది. మార్కెట్‌లో ధర ఉంటేనే రైతులకులాభం లేదంటే నష్టమే అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కమీషన్ కాదు.. చేబదులే..

- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారుల వద్ద నాయకుల వసూళ్లు
- తిరిగిస్తామని చెబుతూ ఎగ్గొడుతున్న ప్రజాప్రతినిధులు
- నష్టపోతున్న లబ్ధిదారులు



మోర్తాడ్(బాల్కొండ): 'మీ కూతురి పెళ్లి చేస్తే మీకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కు ఇప్పించాం కదా నాకు కొంత ఇబ్బందిగా ఉంది ఒక రూ. 10 వేలు ఉంటే చేబదులుగా ఇవ్వండి మళ్లీ ఇస్తాను' అని కొందరు నాయకులు తమ వసూళ్ల పర్వానికి తెరలేపారు. పథకాలకు సాయం చేసి కమీషన్ రూపంలో డబ్బులు వసూలు చేస్తే బద్నాం అవుతామనే ఉద్దేశ్యంతో మరో ఎత్తుగడ వేసి చేబదులు రూపంలో డబ్బులు తీసుకుంటున్నట్లు వెలుగులోకి వచ్చింది. చేబదులుగా తీసుకున్న డబ్బు వాపసు ఇవ్వకుండా లబ్ధిదారులను ఇబ్బంది పెడుతున్న నాయకుల తీరు వివాదాస్పదమైంది. మోర్తాడ్ మండలంలోని వివిధ గ్రామాల్లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారుల నుంచి ఇద్దరు, ముగ్గురు నాయకులు తమ వసూళ్ల తంతును నిరంతరం కొనసాగిస్తూనే ఉన్నారు. కమీషన్‌గా తీసుకుంటే చెడ్డపేరు వస్తుందని భావించి చేబదులు రూపంలో డబ్బులు తీసుకుని తమ జేబులు నింపుకుంటున్నారు. మండలంలోని ఒక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో నాయకుడు ఒకరు పదిమంది లబ్ధిదారుల నుంచి చేబదులు రూపంలో సొమ్ము తీసుకున్న సొమ్మును వాపసు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు బహిరంగంగానే అడిగినట్లు తెలుస్తుంది. కొందరు నాయకులు తమ వసూళ్లను యథేచ్ఛగా కొనసాగిస్తున్నా అగ్రనాయకులు మాత్రం నోరు మెదపకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుంది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ల లబ్ధిదారుల నుంచి వసూళ్లు చేస్తున్న నాయకుల తీరుపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DIRECT FINAL YEAR

■ Direct Final Year: Discontinued (or) Fail Degree; P.G., LL.B, B.Tech, M.Tech, B.Sc, M.Sc అగ్రి, నర్సింగ్ BPT, MPT, P.hd. Cell: 9951627996, 8885404396. [W-785649]

WANTED

■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 88854 86421. [M-1221494]

■ ప్రముఖ బ్యాంకులలో కం॥ ఆపరేటర్స్ /క్లర్క్స్ / అటెండర్స్ / ఆఫీస్ అసిస్టెంట్స్ / అకౌంటెంట్స్/ క్యాషియర్స్. Q: 10th-PG, ఆకర్షణీయమైన జీతం. 9492881006. [G-7531]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రైం కార్నర్

సిద్ధివినాయక కాలనీలో చోరీకి యత్నం

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిద్ధివినాయకకాలనీలో చోరీకి యత్నించినట్లు స్థానికుల ద్వారా తెలిసింది. శనివారం అర్ధరాత్రి సమయంలో వచ్చిన దొంగలు నాలుగు ఇళ్లలో చోరీకి యత్నించగా స్థానికులు కేకలు వేయడంతో పరారయ్యారు. చోరీకి వచ్చినట్లు సీసీ టీవీ ఫుటేజీలో రికార్డయినట్లు సమాచారం.

సాయిబాబా ఆలయంలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తి చోరీకి యత్నించినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. ఆలయ పూజారి సుధాకర్ కులకర్ణి శనివారం రాత్రి 10 గంటలకు ఆలయానికి తాళం వేసి వెళ్లారు. ఉదయం 5గంటలకు పూజారి భార్య మంగల కులకర్ణి ఆలయం గేటు తాళం తీసేందుకు వెళ్లగా అక్కడ అనుమానాస్పదంగా వ్యక్తి కనిపించడంతో కేకలు వేసింది. దీంతో ఆ వ్యక్తి పారిపోయాడు. ఆలయం లోపలికి వెళ్లి చూడగా లోపల హుండీని పగలగొట్టేందుకు ప్రయత్నించినట్లు ఉంది. ఆలయ నిర్వాహకుడు సుధాకర్ కులకర్ణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఒకరి అదృశ్యం



వడ్ల కాశీరాం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లి గ్రామానికి చెందిన వడ్ల కాశీరాం అదృశ్యమైనట్లు గ్రామస్తులు తెలిపారు. కాశీరాం(50) ఈనెల 17వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు ఇంటి నుంచి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పటి నుంచి మూడు రోజులుగా వెతికినా దొరకకపోవడంతో ఆయన కుటుంబీకులు హైదరాబాద్‌లోని సూరారం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. కాశీరాం కనిపిస్తే ఉదయ్‌గౌడ్‌కు 7815899061 సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలకేంద్రానికి చెందిన దమ్మడి మమత (32) ఆదివారం తాడెం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మమతకు నరేష్‌తో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. నరేష్ మోపాల్‌కు ఇల్లరికం వచ్చాడు. వారికి ముగ్గురు కుమార్తెలు. కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఇద్దరికి గొడవలు జరుగుతున్నాయి. తాజాగా మూడ్రోజుల క్రితం గొడవ జరగగా, మమత ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబ కలహాలతో విరక్తి చెందిన ఆమె తాడెం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మృతదేహానికి పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్రాసుపత్రికి తరలించారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో తల్లీకూతుళ్లు అదృశ్యమైనట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం జక్రాన్‌పల్లికి చెందిన గాజనవెల్లి శిరీషా తన పెద్ద కూతురు ప్రతిమతో కలిసి శనివారం సాయంత్రం వీక్లీ మార్కెట్‌కు వెళ్లిందని తెలిపారు. మార్కెట్‌కు వెళ్లిన తల్లి శిరీషా, కూతురు ప్రతిమ ఇద్దరూ ఇంటికి తిరిగి రాలేదన్నారు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త నర్సింగ్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి



ముఫాసిల్ మృతదేహం

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్ర శివారులో జాతీయ రహదారి 44 పక్కన ఉన్న మాధవి సిమెంట్ పైపుల తయారీ కంపెనీలో క్రెయిన్ ఆపరేటర్ నిర్లక్ష్యం కారణంగా విద్యుత్తు షాక్ తగిలి బాల్కొండ మండల కేంద్రానికి చెందిన ఎండీ ముఫాసిల్(19) మృతి చెందాడు. బాల్కొండ ఎస్సై గోపి తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాలీ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ముఫాసిల్ గిరాకీ కోసం సిమెంట్ పైపుల కంపెనీ నుంచి పైపులు తీసుకురావడానికి ఆదివారం వెళ్లాడు. కంపెనీలో క్రెయిన్ ఆపరేటర్ పైపులను ఎత్తేందుకు క్రేయిన్‌కు ఉన్న ఇనుప కొండీని తగిలించాలని సూచించాడు. కాని క్రేయిన్ 11 కేవీ విద్యుత్ లైన్ కింద ఉన్న విషయాన్ని మరిచాడు. దీంతో క్రేయిన్‌కు ఉన్న ఇనుప కొండీని పట్టుకోగానే ముఫాసిల్‌కు విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలాడు. వెంటనే అక్కడ ఉన్న కార్మికులు గమనించి ఆర్మూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాల్కొండ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి వివాహం కాలేదని స్థానికులు తెలిపారు.

వాహనం ఢీకొని వృద్ధురాలు..



వృద్ధురాలి మృతదేహం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం ఆర్టీసీ బస్టాండ్‌సమీపంలో ఐచర్ వాహనం అదుపుతప్పి వృద్ధురాలికి ఢీకొట్టగా ఆమె కాలు విరిగి నుజ్జునుజ్జయ్యింది. అక్కడే పనిచేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు 108కు సమాచారం అందించి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. వృద్ధురాలి వయస్సు 50 నుంచి 60 మధ్యలో ఉంటుందన్నారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలో మార్చురీలో భద్రపర్చారని, సంబంధింకులు ఎవరైన ఉంటే ఆర్మూర్ పీఎస్‌లో సంప్రదించాలన్నారు.

పందుల కోసం ఘర్షణ: ఒకరి మృతి

రెంజల్(బోధన్): పందుల కోసం జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం బోధన్ పట్టణానికి చెందిన కెంబసర్ది వెంకట్ అలియాస్ నాగరాజు(32) అతని స్నేహితులతో కలిసి శుక్రవారం రెంజల్ బస్టాండ్‌లో పందులను పట్టుకునేందుకు వచ్చారు. బస్టాండ్‌లో దొరికిన పందులను తీసుకుని పోతుండగా విషయం తెలుసుకున్న సాటాపూర్ గ్రామానికి చెందిన కొందరు వచ్చి వారిని అడ్డుకున్నారన్నారు. ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుని ఘర్షణకు దారితీసిందన్నారు. దాడిలో గాయపడిన నాగరాజ్‌ను అతని స్నేహితులు నిజామాబాద్‌లోని ఆస్పత్రిలో చేర్పించారని ఎస్సై పేర్కొన్నారు. శనివారం నాగరాజు సోదరుడు అశోక్ సాటాపూర్‌కు చెందిన హన్మంతు, గంగాధర్, శంకర్‌లతో పాటు మరి కొందరిపై ఫిర్యాదు చేశారని వివరించారు. ఆదివారం చికిత్స పొందుతూ నాగరాజు మృతిచెందినట్లు తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

అప్పు తీర్చలేదని.. అడవిలోకి తీసుకెళ్లి దాడి



గాయాలు చూపిస్తున్న సాయిలు

ఖలీల్‌వాడి: అప్పుతీర్చడం లేదని నగర శివారులోని మల్లారం అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి తండ్రీ, ఇద్దరు కొడుకులు కలిసి ఓ వ్యక్తిని చితకబాదిన సంఘటన ఆదివారం నిజామాబాద్ రూరల్ మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం నిజామాబాద్ రూరల్ మండలంలోని కొత్తపేట్‌కు చెందిన మంగలి సాయిలు మల్కాపూర్ తండాకు చెందిన కమల్‌చంద్ వద్ద రూ. 15 వేలు అప్పు తీసుకున్నాడు. సాయిలు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ.. కమల్‌చంద్‌కు చెందిన భూమిని అమ్మేసేలా సహాయం చేశాడు. అప్పు ముట్టిందని వారు ఒప్పుకున్నాడు. కాని కొన్నిరోజులకు రూ. 15 వేలు అప్పు తీర్చాలని ఒత్తిడి చేసి సాయిలు బైక్‌ను కమల్‌చంద్ వర్గీయులు తీసుకెళ్లాడు. ఆదివారం ఉదయం అప్పు విషయమై మాట్లాడాలని పిలిపించిన కమల్‌చంద్, ఇద్దరు కుమారులు వికాస్, సురేష్ మల్లారం అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి చితకబాదారు. బాధితుడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

చెరువులో పడి వృద్ధురాలి మృతి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలకేంద్రంలోని చెరువులో ప్రమాదవశాత్తు పడి గ్రామానికి చెందిన సాకలి చిన్నుబాయి (60) మృతిచెందినట్లు ఏఎస్సై దయాల్‌సింగ్ ఆదివారం తెలిపారు. చిన్నుబాయి దుస్తులు ఉతికేందుకు శనివారం చెరువుకు వెళ్లింది. దుస్తులు ఉతికిన తర్వాత స్నానం చేసేందుకు చెరువులోకి దిగింది. ప్రమాదవశాత్తు జారి పడి మునిగిపోయింది. ఆదివారం మృతదేహం తేలడంతో పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతురాలి చెల్లెలు కుమార్తె స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్సై తెలిపారు. చిన్నుబాయికి కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం ముంబాయిలో ఉన్నాడు.

చేపల వేటకు వెళ్లి ఒకరు..

మాక్లూర్: చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని బొంకన్‌పల్లి చెక్ డ్యాంలో జరిగింది. మాక్లూర్ ఎస్సై సుధీర్‌రావు కథనం మేరకు నిజామాబాద్ రూరల్‌లోని పాల్దాకు చెందిన మల్కన్న (46) శనివారం సాయంత్రం చేపల వేటకోసం సమీపంలో ఉన్న చెక్‌డ్యాంకు వెళ్లాడు. సాయంత్రం వరకు తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు డ్యాం వద్దకు వెళ్లగా అక్కడ మల్కన్న దుస్తులు, చెప్పులు కనిపించాయి. ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతైనట్లు గుర్తించి గాలించగా ఆదివారం ఉదయం మల్కన్న మృతదేహం లభ్యమైంది. భార్య సాయమ్మ ఫిర్యాదు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి ఒకరు..



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి గ్రామానికి చెందిన సిద్ధరాంరెడ్డి(47) ఊర చెరువులో ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. మృతుడు సిద్ధరాంరెడ్డి తన కుటుంబీకులతో హైదరాబాదులోని సూరారంకు 15ఏళ్ల క్రితం వలస వెళ్లాడు. ఆయనకు భార్య సునీత, ఇద్దరు కూతుర్లు భవాని, శ్రావణి ఉన్నారు. సిద్ధరాంరెడ్డి వారం క్రితం తల్లిని చూసేందుకు కుటుంబికులతో కలిసి శెట్పల్లిసంగారెడ్డికి వచ్చాడు. శనివారం గ్రామ శివారులోని ఊర చెరువుకు కాల కృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. ఆదివారం చెరువులో మృతదేహం తేలగా కుటుంబ సభ్యులు గుర్తించారు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.